ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు
TAMILNADU
సోమవారం 3 నవంబరు 2025



# 'సర్' అమలుకు ఎందుకింత తొందర?

## ● తక్షణమే సవరణ ఆపండి ● లేకుంటే సుప్రీం కోర్టుకు వెళతాం ● డీఎంకే అఖిలపక్షం తీర్మానం

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 4 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తక్షణమే ఆపాలని ఆదివారం జరిగిన డీఎంకే అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. అఖిలపక్షం విజ్ఞప్తి మేరకు ఈ సవరణ పనులను ఆపకుంటే సుప్రీం కోర్టులో పిటిషన్ వేస్తామని కూడా ప్రకటించింది. టి.నగర్‌లోని స్టార్‌హోటల్‌లో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. బిహార్ రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై విచారణ పెండింగ్‌లో ఉండగానే, మరీ ముఖ్యంగా ఆ కేసులో తుది తీర్పు రాకముందే, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలలే ఉన్న తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం ఈ సవరణ ప్రక్రియ ప్రారంభించడం గర్హనీయమని



టి.నగర్ స్టార్ హోటల్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రారంభించిన తొలి దినాల్లోనే దేశంలో మెజారిటీ రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకత తెలిపాయని, కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీ పాలకులకు పనిముట్టుగా మారిందంటూ విమర్శలు వెల్లువలెత్తాయన్నారు. బిహార్‌లో జరిగినట్లే బీజేపీ వ్యతిరేక ఓటర్లను, ప్రత్యేకించి మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓటర్లను జాబితాలో నుంచి తొలగించటం ఖాయం కనుకనే 'సర్' అఖిలపక్షం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణలో జరిగిన భారీ అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం న్యాయస్థానానికి గానీ, ప్రజా ప్రతినిధుల సభకు గానీ ఎలాంటి వివరణ ఇవ్వలేదన్న విషయాన్ని ఎవరూ మరువకూడదన్నారు. బిహార్‌లో జరిగిన సవరణ పనుల అవకతవకలు సరిదిద్దుకోక ముందే తమిళనాడు సహా 12 రాష్ట్రాల్లో ప్రజలకున్న ఓటు హక్కును హరించి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం తొందరపడుతోందని అఖిలపక్ష సమావేశంలో ఆరోపించారు.

### ప్రజాప్రాతినిధ్య చట్టానికి వ్యతిరేకం...

ప్రజాప్రాతినిధ్య చట్టం 1951సెక్షన్ 169 ప్రకారం కేంద్ర ప్రభుత్వం గెజిట్‌లో సక్రమమైన ప్రకటన చేసిన మీదటే ఓటర్ల జాబితా సవరణ చేపట్టాల్సి ఉందని, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఆ పద్ధతికి స్వస్తి చెప్పటంతో కేంద్ర ఎన్నికల సంఘమే యథేచ్ఛగా సవరణ జరుపనున్నట్లు ప్రకటించడమే ప్రజాప్రాతినిధ్య చట్టానికి వ్యతిరేకమని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులకు 12వ ధ్రువీకరణ పత్రంగా ఆధార్ కార్డు చేర్చాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులిచ్చినా ఆధార్‌కార్డు ధ్రువీకరణ పత్రం కాదనే రీతిలో కేంద్ర ఎన్నికల సంఘం అయోమయ ప్రకటనలు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న సవరణ పారదర్శకంగా లేదని, గుట్టుచప్పుడు కాకుండా లక్షల సంఖ్యలో ఓటర్లను తొలగించడమే ఆ సంఘం ప్రధాన లక్ష్యంగా ఉందని స్టాలిన్ విమర్శిం చారు. ఈ సమావేశానికి డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు, ద్రవిడ కళగం నేత కే వీరమణి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు కే సెల్వపెరుంతగై, ఎండీఎంకే నేత వైగో, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి పి.షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎం.వీరపాండ్యన్, ఎంఎన్ఎం నేత కమల్‌హాసన్, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ నేత కేఎం ఖాదర్‌మొహిద్దీన్, కెఎండీకే నేత ఈఆర్ ఈశ్వరన్, తమిళవాళ్వురిమై కట్చి నేత డి. వేల్‌మురుగన్, మనిదనేయ మక్కల్ కట్చి నేత ఎంహెచ్ జవాహిరుల్లా, ఆమ్ ఆద్మీ, టీఎంఎంకే, ముక్కులత్తోర్ పులిపడై, ఎస్‌డీపీఐ పార్టీ సహా 46 పార్టీల నాయకులు, ప్రతినిధులు హాజరయ్యారు.

### అఖిలపక్షానికి రానివారంతా పిరికిపందలు

● డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం జరుపతలపెట్టిన సర్‌ను వ్యతిరేకిస్తూ నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి గైర్హాజరైనవారంతా పిరికిపందలని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి విమర్శించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎంకే అఖిలపక్ష సమావేశానికి గైర్హాజరైనవారిని గురించి చింతించాల్సిన పనిలేని, సమావేశానికి హాజరైనవారికి ఈ సందర్భంగా దన్యవాదాలు తెలిపారు. బీజేపీ సిద్ధాంతపరంగా తీవ్రంగా వ్యతిరేకిస్తామని ప్రగల్భాలు పలికిన టీవీకే కూడా కేంద్రంలోని ఆ పార్టీ పాలకులకు భయపడి అఖిలపక్ష సమావేశానికి రాలేదని ఆయన ఆరోపించారు. ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసి, ఆ సవరణ ప్రక్రియ నిలిపేంతవరకూ డీఎంకే నేతల విశ్రమించరని ఆయన తెలిపారు.

# 'సర్'పై అఖిలపక్షం ఓ కపట నాటకం

● టీవీకే అధినేత విజయ్ ధ్వజం



ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కి వ్యతిరేకంగా డీఎంకే అఖిలపక్ష సమావేశం నిర్వహించడం ఓ కపట నాటకమేనని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలో సర్ చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన రోజే తమ పార్టీ తీవ్ర అభ్యంతరం తెలిపిందన్నారు. బిహార్‌లో ఓటర్ జాబితా సవరణ పేరుతో ఎన్నికల కమిషన్ చేసిన మోసం వల్ల ఆ రాష్ట్రంలో లక్షలాది మంది పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించారని, ముఖ్యంగా కొత్తగా ప్రకటించిన సర్ పేరుతో నిర్వహించబోయే పనులు పారదర్శకంగా ఉండే అవకాశం లేదని విజయ్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో దాదాపు 6కోట్ల 36లక్షల 12వేల మందికి పైగా ఓటర్లు ఉన్నారని, ఇంతమంది పేర్లను 30రోజుల్లో పరిశీలించి అర్హులైన వారిని ఎంపికచేయడం ఎలా సాధ్యపడుతుందని ఈసీని ప్రశ్నించారు. సర్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెబుతున్న డీఎంకే ఈ అంశంపై అసెంబ్లీలో తీర్మానం ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న కారణంగా అధికార డీఎంకే సర్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన అఖిలపక్ష సమావేశం కపటనాటకమని విమర్శించారు. వాస్తవంగా చెప్పాలంటే డీఎంకే మతవాద బీజేపీతో పరోక్షంగా పొత్తు కుదుర్చుకుని ప్రజల హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజా హక్కులను, ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో తమ పార్టీ ముందు వరుసలో ఉంటుందని విజయ్ ధీమావ్యక్తం చేశారు.

# డీఎంకేకు వ్యతిరేకంగా ప్రజాకర్షణ ప్రచార కార్యక్రమాలు

## ● అన్నాడీఎంకే ఐటీ వింగ్‌కు ఈపీఎస్ ఆదేశం



సమావేశంలో సీనియర్ నేతలతో ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని అధికార డీఎంకేకు వ్యతిరేకంగా ప్రజలను ఆకర్షించే విధంగా ముమ్మరంగా ప్రచారం చేపట్టాలని అన్నాడీఎంకే ఐటీ వింగ్‌కు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) దిశా నిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనేందుకు అన్నాడీఎంకే మిగతా పార్టీల కంటే ముందే ఏర్పాట్లు చేపట్టింది. ఒకవైపు ఈపీఎస్ 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మరోవైపు పార్టీ ఐటీ వింగ్‌కు నియమించిన 39 జిల్లాల సాంకేతిక నిపుణులు, పార్టీ జిల్లా కార్యదర్శులు, సీనియర్ నేతలతో ఈపీఎస్ ఆదివారం సమావేశమయ్యారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగై ప్రాంగణంలో మాజీ ముఖ్యమంత్రులు, ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు పూలదండలు వేసి ఈపీఎస్ నివాళులర్పించారు. అనంతరం పార్టీ కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్, సీనియర్ నేతలు నత్తం విశ్వనాథన్, ఎస్పీ వేలుమణి తదితరులతో కలిసి ఐటీ వింగ్ నిర్వాహకులకు ఈపీఎస్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పలు కీలక సూచనలిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పరుగులు తీస్తున్న నేపథ్యంలో, ప్రజలు సామాజిక మాధ్యమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, ముఖ్యంగా యువతను ఆకట్టుకునేలా ఆధునిక ప్రచార యుక్తి చేపట్టాలని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత రాష్ట్రప్రజలకు అందించిన సంక్షేమ అభివృద్ధి పథకాలు, తన సారథ్యంలో ఐదేళ్ల అన్నాడీఎంకే సాధించిన విజయాల సారాంశాన్ని ప్రజల్లోకి ప్రచార రూపంలో తీసుకెళ్లాలని సలహా ఇచ్చారు. అదేవిధంగా కేంద్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎస్ఐఆర్ సవరణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ముఖ్యంగా న్యాయవాలు, విద్యార్థులు, యువజన విభగాల్లో ఇళంపిన్ పాసరైలలోని 9 మంది సభ్యుల బూత్ కమిటీలో ముగ్గురు మహిళలుండేలా చూడాలని ఆయన సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే పార్టీ తరుఫున చేపట్టే ప్రచారాన్ని ఇంటింటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఐటీ వింగ్‌దేనన్న విషయం గుర్తించి సైనికుల్లా పనిచేసి పార్టీని మెజారిటీ స్థానాల్లో గెలిపించాలని ఎడప్పాడి పళనిస్వామి హితవుపలికారు.

### రాష్ట్ర కాంగ్రెస్‌లో

# మహిళలకు గౌరవం లేదు

● మహిళా కాంగ్రెస్ నాయకురాలు హసీనా సయ్యద్ ఆరోపణ



చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్‌లో మహిళలకు గౌరవం లేదంటూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు హసీనా సయ్యద్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ శుక్రవారం జరిగిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏర్పాటైన నివాళి సభ ఆహ్వాన పత్రంలో తన పేరుగానీ, మహిళా కాంగ్రెస్ స్థానిక కమిటీ సభ్యుల పేర్లు గానీ లేవని, ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తే మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సభలు జరుపుకోండి మాకెలాంటి అభ్యంతరాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు.. టీఎన్‌సీసీ నేతల ఆదేశాలను రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కమిటీ సభ్యులంతా శిరసావహిస్తున్నారని, ఓట్ల చోరీకి వ్యతిరేకంగా 3 లక్షలమంది సంతకాలను కూడా సేకరించి ఇచ్చామని తెలిపారు. తిరునల్వేలిలో జరిపిన పార్టీ మహానాడుకు 5 వేల మంది మహిళా కార్యకర్తలను తరలించాలని చెబితే సుమారు 7 వేలమందికి పైగా మహిళా సభ్యులను సమీకరించి మహానాడును విజయవంతం చేశామని ఆమె పేర్కొన్నారు. ఇంత చేసినా టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయంలో కొంత మంది మహిళా నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆమె ఆరోపించారు. తిరునల్వేలిలో జరిగిన మహానాడు వేదికపై తనకు సీటు కేటాయించలేదని, ఆ విషయాన్ని పార్టీ హైకమండ్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కాంగ్రెస్‌లో మహిళలకు ప్రాధాన్యత కల్పించాలన్న సదుద్దేశంతోనే మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మహిళా కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారని, నటి ఖుష్బూ, విజయధరణి వంటి మహిళలు పదవులు అనుభవించి వెళ్ళిపోయారని, తాను కనీసం వార్డు కౌన్సిలర్‌గా కూడా ఎన్నికకాలేదని, సంపాదించాలనుకుని ఉంటే ద్రావిడ పార్టీల వైపు మొగ్గు చూపి ఉండేవారమని, ఆది నుండి కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉండటం వల్లే పార్టీని విడిచిపెట్టేందుకు తటపటాయిస్తున్నామన్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పార్టీ మహిళా విభాగంలో వైద్యులు, న్యాయవాదులు సహా విద్యావంతులను జిల్లా విభాగం అధ్యక్షులుగా నియమించామని చెప్పారు. ఈ నెల 14న జిల్లా విభాగం అధ్యక్షులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు ఎక్కువ సీట్లు కేటాయించేలా పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి చేస్తామని హసీనా సయ్యద్ తెలిపారు.

# ప్రజల బాగోగులు పట్టని విజయ్

● సినీ నటుడు కరుణాస్



చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత విజయ్‌కి రాష్ట్ర ప్రజలను సంరక్షించాలన్న చింతనే లేదని ముక్కులత్తోర్ పులిపడై నేత, సినీనటుడు కరుణాస్ విమర్శించారు. డీఎంకే అఖిలపక్ష సమావేశంలో పాల్గొని తిరిగి వెళ్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం సర్ పేరుతో జరుపనున్న ఓటరు జాబితా సవరణలు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని తెలిసినా విజయ్ అఖిలపక్ష సమావేశానికి పార్టీ తరఫున ఎవరినీ పంపకపోవడం గర్హనీయమన్నారు. అత్యంత కీలకమైన ఈ ప్రత్యేక సమగ్ర సవరణపై ఏర్పాటైన అఖిలపక్ష సమావేశానికి టీవీకే హాజరు కాకుండా తమ పార్టీ ప్రజా వ్యతిరేకమైన పార్టీ అని రుజువు చేసుకుందని కరుణాస్ విమర్శించారు.



చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడో విడత కౌన్సెలింగ్‌లో అదనంగా 650 ఎంబీబీఎస్ సీట్లు చేర్చినట్లు రాష్ట్ర ఎంపిక కమిటీ ప్రకటించింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయింది. ప్రస్తుతం మూడో విడత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. దీనికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను అంతర్జాలంలో విడుదల చేశారు.

## మూడో విడత కౌన్సెలింగ్‌లో అదనంగా 650 ఎంబీబీఎస్ సీట్లు

ఆ మేరకు 1118 ఎంబీబీఎస్ సీట్లు, 631 బీడీఎస్ సీట్లు ఖాళీ ఉన్నాయని ప్రకటించారు. ఈ యేడాది అడ్మిషన్ల కోసం మూడో విడత కౌన్సెలింగ్‌కు అదనంగా 650 ఎంబీబీఎస్ సీట్లను రాష్ట్ర ఎంపిక కమిటీ చేర్పించింది. జాతీయ వైద్య మండలి 8 ప్రైవేటు కళాశాలల్లో అదనంగా 550 ఎంబీబీఎస్ సీట్లను, రాష్ట్రంలోని తక్షశిల ప్రైవేటు వైద్య విశ్వవిద్యాలయంలో 100 ఎంబీబీఎస్ సీట్లకుగాను అడ్మిషన్ల కోసం అనుమతిచ్చింది. మూడో విడత కౌన్సెలింగ్‌లో చేర్చిన 650 ఎంబీబీఎస్ సీట్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 7.5 రిజర్వేషన్ల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 30 మంది విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లు కల్పించే అవకాశం ఏర్పడింది.

### బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పుడే

# అన్నాడీఎంకే పతనం ఆరంభం

● కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం



చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మతతత్వ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటి నుంచే అన్నాడీఎంకే పతనం ఆరంభమైందని శివగంగ కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు కార్తీ చిదంబరం విమర్శించారు. మదురైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ బిహార్‌లో తన హోదా మరచి తమిళనాట బిహార్ కార్మికులను డీఎంకే నేతలు చిత్రహింసలు పెడుతున్నట్లు విమర్శించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోదన్నారు. బ్రతుకు తెరువు కోసం, ఉపాధి కోసం వస్తున్న ఉత్తరాది కార్మికులను తమిళ ప్రజలెప్పుడూ సాదరంగానే స్వాగతిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. తమిళనాట బిహార్ కార్మికులు స్వేచ్ఛగా తమిళ ప్రజలతో మమేకమై జీవనం సాగిస్తున్నారని తెలుసుకునే ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుండి ఎక్కువగా యువకులు ఉపాధి కోసం రాష్టానికి వస్తున్నారని తెలిపారు. అన్నాడీఎంకేలో సీనియర్ నేత సెంగోట్టయ్యన్‌ను పార్టీ నుండి బహిష్కరించడం గర్హనీయమని, అన్నాడీఎంకే మనుగడకు ముప్పువాటిల్లే పరిస్థితులు ఏర్పడినప్పుడల్లా పార్టీని కంటికి రెప్పలా కాపాడినవారిలో ఆయన కూడా ఒకరని, అలాంటి వ్యక్తిని డిస్మిస్ చేయడం ఘోర తప్పిదమేనని కార్తీ చిదంబరం అన్నారు.

### వేలుచ్చామిపురంలో

# మూడోరోజూ సీబీఐ విచారణ



సీబీఐ కార్యాలయం వద్ద వేచి ఉన్న వ్యాపారులు

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీవీకే నేత విజయ్ రోడ్‌షో సందర్భంగా తొక్కిసలాటలో 41 మంది మృతి చెందిన సంఘటనపై దర్యాప్తు జరుపుతున్న సీబీఐ అధికారులు వేలుచ్చామిపురంలోని వ్యాపారులను మూడో రోజు విచారణ జరిపారు. రెండు రోజులపాటు దుర్ఘటన జరిగిన ప్రాంతంలో విచారణ జరిపిన అధికారులు ఆ ప్రాంతంలో తెరిచి ఉన్న దుకాణాలకు వెళ్లి తొక్కిసలాట ఎలా జరిగిందంటూ వ్యాపారులను ప్రశ్నించారు. శనివారం త్రీడీ లేజర్ స్కానర్ ఉపయోగించి దుర్ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం వేలుచ్చామిపురం వద్దనున్న వ్యాపారులను కార్యాలయానికి పిలిపించిన సీబీఐ అధికారులు వారిని విచారించారు.



చెన్నై మెరీనాబీచ్ నేపియర్ బ్రిడ్జి వద్ద ఆదివారం ఉదయం మద్రాస్ రౌండ్ టేబుల్-1 ఆధ్వర్యంలో ఏర్పాటైన మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

## కుంకీ-2 ఫస్ట్‌సాంగ్ రిలీజ్

డాక్టర్ జయంతిలాల్ కాటా (బెన్ స్టూడియోస్) సమర్పణలో దర్శకుడు ప్రభు సాల్మన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కుంకీ-2' మూవీ ఫస్ట్ సింగ్ సాంగ్ విడుదలైంది. 13 యేళ్ళకు ముందు ప్రభు సాల్మన్ దర్శకత్వంలో వెలువడిన 'కుంకీ' బ్లాక్‌బస్టర్ మూవీగా తమిళ ప్రేక్షకులను షైమరపించింది. ప్రస్తుతం కుంకీ సెకెండ్ పార్ట్ మూవీ కూడా ఆ రీతిలోనే ప్రేక్షకులను షైమరపిస్తుందని చెబుతున్నారు. ఈ మూవీలో మది అనే యువకుడు హీరోగా పరిచయమవుతున్నాడు. ఓ యువకుడు, కుంకీ ఏనుగు మధ్య జరిగే ఆసక్తికరమైన సంఘటనలతో ఈ చిత్రకథాంశాన్ని రూపొందించారు. ప్రస్తుతం మూవీ సంస్థ విడుదల చేసిన 'పొత్తి పొత్తి ఉన్న వచ్చి' అనే మెలోడీసాంగ్ నెటిజన్లను షైమరపిస్తోంది.


హీరో మది

## ఉత్తర చెన్నై కథాంశంతో 'మద్రాస్ మాఫియా కంపెనీ'

'బాషా, సూర్యవంశం, పోకిరి' చిత్రాలలో విలన్‌గా తమిళ ప్రేక్షకులను మెప్పించిన నటుడు ఆనంద్‌రాజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మద్రాస్ మాఫియా కంపెనీ'. ఈ చిత్రం ద్వారా ఏఎస్ ముకుందన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో బిగ్‌బాస్ ఫేమ్ సంయుక్త కీలక పాత్రలో నటించారు. ఉత్తర చెన్నైలో జరిగే సంఘటనల ఆధారంగా ఈ చిత్రకథాంశం ఉంటుందని దర్శకుడు ముకుందన్ తెలిపారు. అన్నా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వి. శక్తి అన్నాదురై ఈ చిత్రాన్ని నిర్మించారు. మునీష్ కాంత్, దీపా, శశిలయా, రామ్స్ ఆనంద్‌బాబు తదితరులు నటించారు. ఈ నెల 14న విడుదలవుతున్న ఈ చిత్రం ట్రైలర్ రెండు రోజులకు ముందు రిలీజై నెటిజన్లను బాగా ఆకట్టుకుంది.

ట్రైలర్ విడుదల చేస్తున్న ప్రముఖ దర్శకుడు ఆర్కే సెల్వమణి తదితరులు




## సురేష్ రవి హీరోగా గ్రామీణ కథాంశంతో కొత్త మూవీ

బీఆర్ టాకీస్ కార్పొరేషన్ బ్యానర్‌పై భాస్కరన్ బి.రాజపాండ్యన్ పి, డాంగి నిర్మిస్తున్న చిత్రంలో సురేష్ రవి, యోగిబాబు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కే బాలయ్యా దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ ఇటీవలే పూర్తయ్యాయని, పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతుందని దర్శకుడు బాలయ్య తెలిపారు. మదురై, రామనాథపురం, తేని, చెన్నై ప్రాంతాల్లో 45 రోజుల పాటు షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రంలో దీపా బాలు, తేజా వెంకటేష్ తదితరులు నటించారు.


సురేష్ రవి, యోగిబాబు


అర్జున్ అశోకన్

## అర్జున్ అశోకన్, రోషన్ మాథ్యూ మూవీ 'చత్తా పచ్చా'

అర్జున్ అశోకన్, రోషన్ మాథ్యూ యాక్షన్ మూవీ 'చత్తా పచ్చా' టీజర్ విడుదలై సినీప్రియులను రంజింపజేస్తోంది. స్వల్పకాలంలోనే ఈ టీజర్ నెటిజన్లను బాగా ఆకట్టుకుంటోంది. సహజ నటుడిగా పేరుతెచ్చుకున్న అర్జున్ అశోకన్ ఈ చిత్రంలో కొత్త డైమన్షన్‌లో నటించారు. రోషన్ మాథ్యూ ఆయనకు గట్టిపోటీ ఇచ్చేలా నటించారు. వీరితోపాటు విశాఖ నాయర్, ఇషాన్ షౌగత్ తదితరులు నటించారు. షిహాన్ షౌక్, రితేష్ ఎస్.రామకృష్ణన్ నిర్మించగా, అద్వైత్ నాయర్ దర్శకత్వం వహించారు. ఈ టీజర్‌లో వచ్చే యేడాది జనవరిలో ఈ మూవీ రిలీజ్ అవుతుందని ప్రకటించారు.

చిత్రజ్యోతి

# తెలుగు కుటుంబాలకు ప్రాధాన్యమివ్వాలి

- సీతారామనగర్ తెలుగు సంక్షేమ సంఘం కార్యదర్శి లక్ష్మణరావు


సమావేశంలో మాట్లాడుతున్న పాతూరి లక్ష్మణరావు

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనాభాలో 40శాతానికి పైగా ఉన్న తెలుగు కుటుంబాలకు విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కొడుంగైయూర్‌లోని సీతారామ నగర్ తెలుగు ప్రజా సంక్షేమ సంఘం (ఎస్‌టీపీడబ్ల్యూఏ) కార్యదర్శి పాతూరి లక్ష్మణ రావు ప్రభుత్వాన్ని, రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ఎస్‌టీపీడబ్ల్యూఏ 44వ వార్షిక సర్వసభ్య మండలి సమావేశం ఆదివారం సంఘ భవనంలో జరిగింది. ఉదయం సభ ప్రారంభమైన వెంటనే దివంగతులైన సంఘ సభ్యుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. అనంతరం 10, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులతో ఉత్తీర్ణులైన సభ్యుల పిల్లలను ప్రోత్సహిస్తూ నగదు ప్రదానం, అలాగే సీనియర్ల సేవలను కొనియాడుతూ జ్ఞాపికలతో సత్కరించారు. వ్యవహరించిన రెప్కో బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్, ఎస్‌టీపీడబ్ల్యూఏ మాజీ అధ్యక్షుడు వంజరపు శివయ్య మాట్లాడుతూ అమ్మభాష మర్చిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగువారిదేనన్నారు. ముఖ్యంగా తెలుగు సంఘాల్లో లోపాలు వెతకడం మాని, కమిటీని ప్రోత్సహించాలని, పోటీ తత్వాన్ని విడనాడాలని సూచించారు. అలాగే ఆత్కూరి కుటుంబరావు మాట్లాడుతూ, ఆంధ్రులు ఎక్కడ వున్నా.. తెలుగులోనే మాట్లాడాలని సూచించారు. ఎన్నికల కమిటీ పారదర్శకంగా వ్యవహరించాలని, సంఘం తరుపున వాట్సాప్ గ్రూప్‌ను ప్రారంభించాలని బోడి శ్రీనివాసులు కోరారు. కార్యదర్శి పాతూరి లక్ష్మణరావు సంఘాభివృద్ధికి అందించిన సేవలు అపారమని, భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. తెలుగు విద్యాసంస్థలకు పూర్వవైభవం కల్పించేందుకు తెలుగు కుటుంబాలలోని పిల్లలను తెలుగు మీడియంలో చేర్పించాలని సభా ముఖంగా ఆయన పిలుపునిచ్చారు.

### నూతన కార్యవర్గం.....

1976లో స్థాపించి, ప్రస్తుతం 185 మంది సభ్యులతో సామాజిక, సాంఘిక, విద్య, ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో దూసుకెళుతున్న ఈ సంఘంలో ప్రతి మూడేళ్లకు ఒకసారి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునే ప్రక్రియలో భాగంగా ఆదివారం జరిగిన సర్వసభ్య మండలి సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొలకలేటి శ్రీనివాసకుమార్ ఎన్నికవగా మిగతా పదవులకు కొత్త వారిని ఎంపిక చేస్తూ ఆమోదించారు. ఆ మేరకు పాతూరి లక్ష్మణరావు (కార్యదర్శి), దానభనేని పిచ్చేశ్వరరావు (కోశాధికారి), ఆఖం దుర్గాప్రసాద్, సీఎస్ జయకుమార్ (ఉపాధ్యక్షులు), బెల్లం శ్రీధర్, పి.బాలాజీ (సరయుక్త కార్యదర్శి), పి. సుబ్బరాజు, డి. సాంబశివరావు, డియూవీ నరసింహరాజు, డి.సూర్యనారాయణ, టి. నాగరాజు, డి. వినోద్‌కుమార్, పి వెంకటవంశీ కృష్ణ, ఎస్. సీతా రామారాజు (కార్యనిర్వాహక సభ్యులు)గా, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి గౌరవ అధ్యక్షుడిగా ఎంపికైనట్లు ప్రకటించారు



రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్‌ఎన్ రవి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న స్టోరీ ట్రయిల్స్ ఇండియా సీఈఓ విజయ్ ప్రభాత్ కమలాకర.

## శివలింగంపై సూర్యకిరణాలు

- పరవశించిన భక్తులు


శివలింగంపై ప్రసరిస్తున్న సూర్యకిరణాలు

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శివలింగంపై సూర్యకిరణాలు ప్రసరించే అద్భుత దృశ్యం వీక్షిస్తూ భక్తులు పరవశం చెందారు. నాగపట్టణం జిల్లా మరైంజాయనత్తూర్‌లోని మేలమరైకాట్టర్ ఆలయంలో రుద్ర యాగం సహా పలు ప్రత్యేక యాగాలు నిర్వహిస్తుంటారు. ప్రతినెలా అష్టమి రోజున ప్రపంచ శాంతి కోరుతూ ఆలయంలోని కాలభైరవుడి సన్నిధిలో యాగం జరుగుతోంది. ఈ ఆలయంలో ఆదివారం ఉదయం 6 గంటలకు గర్భగుడిలోని శివలింగంపై సూర్యకిరణాలు ప్రసరించాయి. సూర్యకిరణాల వెలుగుల్లో ప్రకాశవంతమైన శివలింగాన్ని పెద్దసంఖ్యలో భక్తులు వీక్షించారు. అనంతరం శివలింగానికి పంచామృతం సహా 16 సుగంధద్రవ్యాలతో అభిషేకించి, పూలతో అలంకరించి మహా దీపారాధన నిర్వహించారు. ఈ ఆలయంలో ప్రతి ఏడాది నవంబరు మొదటి వారంలో ఏదో ఒకరోజు శివలింగంపై సూర్యకిరణాలు ప్రసరిస్తాయని భక్తులు తెలిపారు.

## వైభవంగా తులసీ దామోదరుల కల్యాణోత్సవం


విష్ణుమూర్తి సమేత తులసీ కల్యాణఘట్టం

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడ్‌వే ఆచారప్పన్‌వీధిలో జై వాసవీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తులసీ దామోదరుల తిరుకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అక్షయ బాబా ఆలయ ప్రాంగణంలో ఉదయం విఘ్నేశ్వరపూజతో కార్యక్రమాలు ప్రారంభించి ముత్తైదువులు అష్టోత్తరశత నామ పారాయణం చేశారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని అక్షయబాబా శ్వేత విగ్రహాన్ని, వివిధ దేవతామూర్తుల సన్నిధులను, ఆలయ పరిసర ప్రాంతాలను అలంకరించారు. అనంతరం ఆలయ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు, ఫైనాన్షియల్ ట్రస్టీ డా.ఎంవీ నారాయణగుప్తా, మేనేజర్ అర్చనలు ముత్తైదువులకు పసుపు కుంకుమలు, భక్తులకు అన్నప్రసాదాలు, అర్చకులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.

## సేవా దృక్పథం అలవర్చుకోవాలి


సిద్ధ వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. చెన్నై హరియాణా సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో అన్నానగర్‌లో హరియాణా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు ప్రేమ్ ప్రకాష్ బన్సాల్ అధ్యక్షత వహిమంచగా, కార్యదర్శి అజయ్ గుప్తా స్వాగతం పలికారు. ఈ వేడుకల ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు రోతాష్ సింగ్ నందాల్ ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా సిద్ధ వైద్య శిబిరం ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య పరీక్షలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా న్యాయమూర్తి ఇ.ఇళంగో, చెన్నై అన్నానగర్ పోలీసు అసిస్టెంట్ కమిషనర్ తిరుపతి, తాంబరం జాతీయ సిద్ధ ఆసుపత్రి డైరెక్టర్ డా.జి.సెంథిల్‌వేల్, చెన్నై ప్రభుత్వ సిద్ధ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా.గణేశన్, జ్ఞానోదయం యోగా సెంటర్ అధ్యక్షులు ఈఎస్ శీనివాసన్, మదియళగన్, ఎన్.కన్నన్ సహా పలువురు సిద్ధ వైద్యులు, పెద్దసంఖ్యలో హరియాణా రాష్ట్ర ప్రజలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ



విల్లుపురం, పెరంబూరు శ్మశానవాటికల్లో సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న క్రైస్తవులు

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని క్రైస్తవ శ్మశానవాటికల్లో ఆదివారం సమాధుల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమ కుటుంబాల్లో మరణించిన వ్యక్తుల ఆత్మశాంతి కోసం ప్రార్థించారు. క్యాథలిక్ ఫాదర్లు, బిషప్‌లు సమాధుల తోటలో ప్రార్థనలు నిర్వహించి ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు కాలం చేసిన తమ వారిని స్మరించుకుంటూ సమాధులకు రంగులు వేసి, పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించారు. మరణించినవారికి ఇష్టమైన ఫలహారాలు తయారుచేసి సమాధులపై ఉంచి ప్రార్థించిన అనంతరం కుటుంబ సభ్యులంతా ప్రసాదంగా స్వీకరించారు. అనంతరం పేదలకు సహాయాలు పంపిణీ చేశారు. కాగా, ప్రతి ఏటా నవంబరు 2వ తేదీ సమాధుల పండుగ క్రైస్తవులు పాటిస్తుంటారు.. స్థానిక శాంథోమ్, పెరంబూర్, కీల్పాక్కం, బీసెంట్ నగర్, కాశిమేడు, తాంబరం, అన్నానగర్, మాధవరం, కొడుంగైయూర్, మైలాపూర్, సైదాపేట ప్రాంతాల్లో ఉన్న సమాధుల తోటలు, క్రైస్తవ సంఘాల నిర్వహణలోని సమాధుల్లో ఆదివారం ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలకు క్రైస్తవులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. నాగపట్టణం జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన వేలాంకన్ని దివ్యక్షేత్రం, తిరుత్తురైపూండి మేరీమాత ఆలయంలో బిషప్‌లు, ఫాదర్లు దివంగత క్రైస్తవ మతగురువులు, మృతుల కుటుంబసభ్యులతో కలసి వారిపెద్దల ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు చేశారు.

## కాపు సేవా సమితి ఆధ్వర్యంలో వనభోజనం




ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాపు సేవా సమితి -చెన్నై ఆధ్వర్యంలో కార్తికమాస వనభోజనాల కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. మెప్పేడు సమీపంలోని కళ్లంబేడు గ్రామంలో ఉన్న మూర్తి గార్డెన్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేసి, గోమాతను అలంకరించి పూజించారు. ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు రక రకాల పోటీలు, వినోద కార్యక్రమాలతో సభ్యులు అలరించారు. ఆంధ్రా రుచులతో నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో సభ్యులంతా పాల్గొన్నారు. సమితి అధ్యక్షుడు జి.జగన్మోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



## తుది దశకు పోరూర్-కోడంబాక్కం మెట్రో పనులు

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండో మెట్రో ప్రాజెక్టులో, మూడో మార్గంగా లైట్ హౌస్-పూందమల్లి మధ్య 26 కి.మీ మేర రైలుమార్గం ఏర్పాటుకానుంది. ఈ మార్గంలో లైట్ హౌస్ నుంచి కోడంబాక్కం ఫ్లై ఓవర్ వరకు సొరంగ మార్గం, పవర్ హౌస్ నుంచి పూందమల్లి వరకు ఫ్లై ఓవర్‌పై రైలు మార్గం ఏర్పాటుకానుంది. ఈ మార్గంలో పోరూర్-పూందమల్లి మధ్య మెట్రో పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ విషయమై చెన్నై మెట్రోరైలు లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారులు మాట్లాడుతూ... పూందమల్లి-లైట్ హౌస్ మార్గంలో ఒక భాగంగా పోరూర్-కోడంబాక్కం మధ్య మెట్రోరైలు పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం ఫ్లై ఓవర్ నిర్మాణపనులు 85 శాతం, రైల్వే ట్రాక్ పనులు 50 శాతం, సిగ్నల్, స్టేషన్ నిర్మాణపనులు 40 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఈ మార్గంలో డబుల్ ట్రాక్ నిర్మాణాలు కూడా జాప్యం లేకుండా జరుగుతున్నాయన్నారు. 2026 జూన్‌లోపు పనులు పూర్తి చేసి, ఈ మార్గంలో మెట్రోరైలు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

## పళని ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలోని పళని దండాయుధపాణి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. శని,ఆదివారాలు సెలవులు రావడంతో స్వామివారి దర్శనం కోసం రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆదివారం ఉదయం నుంచే భక్తుల సంఖ్యల క్రమక్రమంగా పెరుగుతుండటంతో క్యూలైన్లలో సుమారు 2 గంటల పాటు వేచివుండి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శన క్యూలైన్లలో బారులుతీరిన భక్తులకు మంచినీరు, మజ్జిగ తదితర పానియాలను పంపిణీ చేశారు. రోప్‌కార్, వించ్‌రైళ్లలో భక్తుల రద్దీ పెరిగింది. రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 200 మంది పోలీసులు, ఆలయ సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొన్నారు.


క్యూలైన్లలో వేచివున్న భక్తులు


ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న రాబర్ట్ బ్రూస్, జీకే దాస్ తదితరులు

## భారతదేశం కళలకు పుట్టినిల్లు

- ఎంపీ రాబర్ట్ బ్రూస్

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భరతనాట్యం, కూచిపూడి తదితర సంప్రదాయ కళలకు భారతదేశం పుట్టినిల్లని తిరునల్వేలి పార్లమెంట్ సభ్యులు రాబర్ట్ బ్రూస్ పేర్కొన్నారు. చూలైమేడు తిరువెంగడపురంలోని కుమరినర్తని మండ్రం ఆధ్వర్యంలో ఆదివారం కళాకారుల అభినందన సభ జరిగింది. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు జీకే దాస్ అధ్యక్షత వహించగా, ఎంపీ రాబర్ట్ బ్రూస్ పాల్గొని భారతదేశ కళలపై రూపొందిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యావేత్త డాక్టర్ ఎస్.దేవరాజ్, అరుళ్ ఆనంద్, క్రిష్టోఫర్, డాక్టర్ ఎం.శివరాజన్, డా.ఎస్ఎం సుందరం తదితరులు పాల్గొన్నారు.

## కాశిమేడు చేపలమార్కెట్‌కు పోటెత్తిన జనం

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురటాసి మాసం ముగిసినా, తుఫాన్ హెచ్చరికల కారణంగా మత్స్యకారులు చేపలవేటకు వెళ్ళకపోవడంతో గత ఆదివారం కాశిమేడు చేపలమార్కెట్ కొనుగోలుదారులు లేక బోసిపోయింది. ఈ నేపథ్యంలో అన్ని పరిస్థితులు అనుకూలించడంతో కాశిమేడు చేపల మార్కెట్‌కు ఆదివారం వేకువజాము నాలుగు గంటలకే నగరవాసులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అదే సమయంలో మూడు రోజులకు ముందు సముద్రంలో చేపలవేటను పూర్తి చేసుకుని తాజా చేపలతో తిరిగొచ్చిన జాలర్ల వద్ద వాటిని కొనడానికి నగరవాసులు పోటీపడ్డారు. దీంతో చేపల ధరలు కూడా పెరిగి అమ్మకాలు సైతం ఊపందుకున్నాయి. కేజీ వంజరం చేపలు రూ.1300లు, కొడువా చేపలు రూ.800లు, తేంగాయ్ పారై రూ.800లు, సీలా చేపలు రూ.500లు, పాల్ సురా చేపలు రూ.400లు, పీతలు రూ.300ల ధరకు విక్రయించారు.

### శ్రీవారి సేవలో మంత్రి రామచంద్రన్


తిరుమల శ్రీవారిని ఆదివారం తమిళనాడు రెవెన్యూ మంత్రి కె.కె.ఎస్.ఎస్.ఆర్. రామచంద్రన్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు లడ్డూప్రసాదం అందజేశారు.

## సమాచార ధ్వని

### జనవరి 21 నుంచి 30 వరకు జేఈఈ మెయిన్స్

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాదికి సంబంధించిన, జేఈఈ మెయిన్స్‌ మొదటి భాగం జనవరి 21 నుంచి 30వ తేది వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు స్వీకరణ శనివారం ప్రారంభమైంది. https://jeemain.nta.nic.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 27వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష ఫలితాలు ఫిబ్రవరి 12వ తేది విడుదల చేయాలని నిర్ణయించారు.

### 7 వరకు ప్లస్‌ టూ జాబితా సవరణ

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్లస్‌ టూ పబ్లిక్‌ పరీక్షలకు విద్యార్థుల పేర్ల జాబితాలో సవరణకు ఈ నెల 7వ తేది వరకు అవకాశం కల్పించారు. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్‌ టూ పబ్లిక్‌ పరీక్షలు మార్చిలో జరుగనున్నాయి. ఈ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల పేర్లతో కూడిన జాబితాలో సవరణకు అక్టోబరు 21 నుంచి 31వ తేది వరకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం సవరణ గడువు ఈ నెల 7వ తేది వరకు పొడిగించారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌ కె.శశికళ అన్ని జిల్లా ప్రభుత్వ పరీక్షల జాయింట్‌ డైరెక్టర్లకు సర్క్యులర్‌ పంపారు.

### విద్యార్థులకు అందజేసే ల్యాప్‌టాప్‌ ధర నిర్ణయం

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులకు అందించనున్న ల్యాప్‌టాప్‌ రూ.21,650 కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఏసర్‌, డెల్‌, హెచ్‌పీ తదితర మూడు కంపెనీలు ఒకే ధరకు కోడ్‌ చేశాయి. అందువల్ల, మూడు సంస్థల నుంచి రూ.21,650లకే ల్యాప్‌టాప్‌ కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన విధివిధానాలు త్వరలో విడుదల చేయనుంది.

### అంబత్తూర్‌లో 2,394 గృహాల విక్రయం

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూర్‌లో అల్పాదాయ వర్గాల కోసం నిర్మించిన 2,394 గృహాలను వాయిదాల పద్ధతిలో విక్రయించాలని హౌసింగ్‌ బోర్డు నిర్ణయించింది. హౌసింగ్‌ బోర్డు ఆధ్వర్యంలో అంబత్తూర్‌లో బేస్‌మెంట్‌ సహా 19 అంతస్తులతో 2,394 గృహాల సముదాయం నిర్మించింది. 628, 633 చ.అ విస్తీర్ణంలో రెండు బెడ్‌రూమ్‌ల ఇళ్లున్నాయి. వీటి ధర రూ.28.53 లక్షలుగా నిర్ణయించారు. ఈ గృహాలను రూ.19,151 నుంచి రూ.24,653 వరకు నెలసరి వాయిదాల్లో 15 సంవత్సరాల పాటు చెల్లించవచ్చు. గృహాలు కొనుగోలుకు ఆసక్తి ఉన్న వారు https://tnhb.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని హౌసింగ్‌ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

### బ్యాంకు లాకర్‌కు చేరిన దేవర్‌ స్వర్ణ కవచం

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా కుముది సమీపం పసుంపొన్‌ ముత్తురామలింగ దేవర్‌ 118వ జయంతి, 63వ గురుపూజ వేడుకలు గత నెల 30వ తేది జరిగాయి. ఈ వేడుకల సందర్భంగా, స్మారక మందిరంలోని దేవర్‌ విగ్రహానికి బంగారు కవచం ధరింపజేస్తుంటారు. ఈ ఏడాది గురుపూజ సందర్భంగా మదురై బ్యాంక్‌లో ఉంచిన బంగారు కవచాన్ని గత నెల 24వ తేది భారీ బందోబస్తు నడుమ పసుంపొన్‌ను తీసుకొచ్చి, దేవర్‌కు అలంకరించారు. వేడుకలు ముగిసిన నేపథ్యంలో, శనివారం విగ్రహం నుంచి బంగారు కవచాన్ని తొలగించి, భారీ పోలీసు బందోబస్తు నడుమ మదురై తీసుకెళ్లి, బ్యాంక్‌ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే కోశాధికారి దిండుగల్‌ శ్రీనివాసన్‌ సహా పలువురు పాల్గొన్నారు.

### మృతిచెందిన అన్నాదమ్ముల కుటుంబానికి సీఎం ఆర్థికసాయం

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెరువులో మునిగి అన్నాతమ్ముడు మృతిచెందడంపై ముఖ్యమంత్రి స్టాలిన్‌ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. నగర శివారు ప్రాంతమైన తిరువేర్కాడులో శనివారం చెరువులో స్నానానికి వెళ్లిన రియాజ్‌ (5), అతడి తమ్ముడు రిజ్వాన్‌ (3) నీటమునిగి మృతిచెందిన విషయం విదితమే. ఈ ఘటనపై సీఎం స్టాలిన్‌ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో, ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు మృతిచెందడం ఎంతో బాధ కలిగించిందన్నారు. చిన్నారుల మృతి ఆ కుటుంబానికి తీర్చలేదన్నారు. ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతితో పాటు తలా రూ.3 లక్షలు ఆర్థికసాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

### కార్తీక దీపోత్సవాలకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవాలను పురస్కరించుకుని తిరువణ్ణామలైకు 4,764 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ప్రపంచ ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ కార్తీక దీపోత్సవాలు ఈ నెల 24 నుంచి 10 రోజుల పాటు జరుగనున్నాయి. ఉత్సవాల్లో ప్రధానాంశంగా డిసెంబరు 3వ తేది ఉదయం 4 గంటలకు ఆలయ ఉత్సవమూర్తి సన్నిధిలో భరణి దీపం, సాయంత్రం 6 గంటలకు కొండ శిఖరంపై మహా దీపం వెలిగించనున్నారు. మరుసటిరోజు గిరి ప్రదక్షిణ జరుగనుంది. కార్తీక దీపోత్సవం ఏర్పాట్లు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ వేడుకలకు సుమారు 40 లక్షల మంది హాజరవుతారని అధికారుల అంచనా. ఈ క్రమంలో, కార్తీక దీపోత్సవం ఏర్పాట్లపై తిరువణ్ణామలై జిల్లా కలెక్టర్‌ దర్పగరాజ్‌, రవాణా శాఖ అధికారులతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తిరువణ్ణామలైకు 4,764 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు తెలిపారు. అలాగే, ప్రాంతీయ రవాణా శాఖ ఆధ్వర్యంలో తిరువణ్ణామలైలో 9 తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటుచేయనున్నామని కలెక్టర్‌ తెలిపారు.

## సేందమంగళం ఆస్పత్రిలో
# మంత్రి సుబ్రమణ్యం ఆకస్మిక తనిఖీ



ప్రసూతివార్డులో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నామక్కల్‌ జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆదివారం ఉదయం సేందమంగళంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం వేకువజాము కొల్లిమలై నుండి కారావళ్ళి వరకు సుమారు 25 కిలోమీటర్ల వరకు 'నడప్పోమ్‌ నలం పెరువోం' (నడుద్దాం ఆరోగ్యంగా ఉందాం) పథకం పాదయాత్ర జరిపారు. ఈ సందర్భంగా సేందమంగళం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళి అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్యసేవల విలువలు తెలుసుకున్నారు. డ్యూటీ డాక్టర్లు విధులకు హాజరయ్యారా? అని వాకబు చేశారు ఆ తర్వాత నామక్కల్‌ కార్పొరేషన్‌లోని పాత ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.కోటితో ఏర్పాటు చేసిన సిద్ధ వైద్య ఆస్పత్రికి ప్రారంభోత్సవం చేశారు. అదేవిధంగా రూ. 2.28 కోట్లతో పుదుసత్తిరం, పరమత్తివేలూరు, తిరుచెంగోడు వద్ద ప్రజారోగ్య కేంద్రాలను ప్రారంభించారు. రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన అనాథపిల్లల మానసిక చికిత్సా కేంద్రానికి కూడా ఆయన ప్రారంభించారు.

### శబరిమలకు ప్రత్యేక రైళ్లు

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం చెన్నై ఎగ్మూర్‌, చెన్నై సెంట్రల్‌ నుంచి కొల్లంకు ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి.

● నెం.0611 చెన్నై ఎగ్మూర్‌-కొల్లం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ రైలు ఈ నెల 14 నుంచి 2026 జనవరి 16వ తేది వరకు (ప్రతి శుక్రవారం) ఎగ్మూర్‌లో రాత్రి 11.55 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4.30 గంటలకు కొల్లం చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06112 కొల్లం-ఎగ్మూర్‌ ప్రత్యేక రైలు ఈ నెల 15 నుంచి 2026 జనవరి 17వ తేది వరకు (ప్రతి శనివారం) కొల్లంలో సాయంత్రం 7.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఎగ్మూర్‌ చేరుకుంటుంది.

● 06113 చెన్నై సెంట్రల్‌-కొల్లం వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 16 నుంచి 2026 జనవరి 18వ తేది వరకు (ప్రతి ఆదివారం) చెన్నై సెంట్రల్‌లో రాత్రి 11.50 గంటలకు బయల్దేరి మరుసటి రోజు 4.30 గంటలకు కొల్లం చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06114 కొల్లం- చెన్నై సెంట్రల్‌ వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 17 నుంచి 2026 జనవరి 19వ తేది వరకు కొల్లంలో సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు చెన్నై సెంట్రల్‌ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ల రిజర్వేషన్‌ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలిపింది.

### ఎన్నెల్సీ నుంచి రాష్ట్రానికి 830 మెగావాట్ల విద్యుత్‌

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా నైవేలిలోని ఎన్నెల్సీ కొత్తగా నిర్మిస్తున్న థర్మల్‌ విద్యుత్‌ కేంద్రం నుంచి రాష్ట్రానికి 830 మెగావాట్ల విద్యుత్‌ను కేంద్ర విద్యుత్‌ శాఖ కేటాయించింది. కడలూరు జిల్లా నైవేలిలో కేంద్ర ప్రభుత్వ ఎన్నెల్సీ సంస్థకు 3,390 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాలున్నాయి. వాటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌లో రాష్ట్రానికి ప్రతిరోజు 1,730 మెగావాట్ల విద్యుత్‌ కేటాయించగా, మిగిలిన విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఇస్తున్నారు. నైవేలిలో తలా 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లతో రెండో కేంద్రాన్ని ఎన్నెల్సీ ప్రారంభించింది. అందులో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో రాష్ట్రానికి 830.44 మెగావాట్లు, పుదుచ్చేరికి 19.56 మెగావాట్లు కేటాయిస్తూ కేంద్ర విద్యుత్‌ శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

### రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడి

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవి సమీపంలో ఆదివారం వేకువజాము చేపలు పట్టే రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికాదళం రాళ్లతో దాడి చేసి వలలను తెంపి తరిమికొట్టారు. బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను కారణంగా పదిరోజులపాటు చేపలవేటకు వెళ్ళని రామేశ్వరం జాలర్లు శుక్రవారం నుంచి చేపల వేటకు వెళ్తున్నారు. శనివారం ఉదయం రామేశ్వరం నుండి 500 మంది జాలర్లు పడవల్లో వెళ్లి కచ్చాదీవి వద్ద చేపలవేట సాగించారు. ఆదివారం వేకువజాము శ్రీలంక నావికాదళం గస్తీ నౌకతో వచ్చి రామేశ్వరం జాలర్లను బెదిరించారు. తమ దేశ సరిహద్దు సముద్రజలాల్లోకి అక్రమంగా ప్రవేశించారంటూ హెచ్చరించారు. అంతటితో ఆగకుండా జాలర్లపై రాళ్ల దాడి చేసి, వలలను తెగగొట్టి నానాబీభత్సం సాగించారు. శ్రీలంక నావికాదళం దాడులను భరించలేక మత్స్యకారులు వలలను ఆ ప్రాంతంలోనే విడిచిపెట్టి వంటి నిండా గాయాలతో తీరానికి చేరుకున్నారు. ఈ సంఘటనపై రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులు వెంటనే మత్స్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

## ఆయుష్మాన్‌ భారత్‌ కార్డుల పంపిణీ



హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్న బీజేపీ నేత కిరణ్‌

తిరుత్తణి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని సానాకుప్పం గ్రామం లో ఆదివారం ఉదయం బీజేపీ జిల్లా నాయకుడు కిరణ్‌ ఆధ్వర్యంలో లబ్దిదారులకు ఆయుష్మాన్‌ భారత్‌ హెల్త్‌కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది కార్యక్రమంలో సానాకుప్పం బీజేపీ పళ్లిపట్టు నార్త్‌ యూనియర్‌ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌, పార్టీ నిర్వాహకులు రాజేంద్రనాయుడు, నరసింహన్‌నాయుడు సహా పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### నకిలీ కార్పొరేషన్‌ అధికారి అరెస్ట్‌

అడయార్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదురైలో కార్పొరేషన్‌ అధికారినంటూ ప్రజల నుంచి నగదు వసూలుచేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. వండియూర్‌ ప్రాంతానికి చెందిన వీరభద్రన్‌, తిరుప్పాలై శ్రీకృష్ణా నగర్‌ ప్రాంతానికి వెళ్లి, అక్కడ ప్రజలతో కార్పొరేషన్‌ అధికారిగా పరిచయం చేసుకుని, భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేషన్‌కు రూ.2,500 చెల్లించాలని ఇంటింటికీ వెళ్లి వసూలు చేశాడు. ఈ విషయమై పలువురు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాడని విచారణలో తెలిసింది. అతడిని అరెస్ట్‌ చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడివున్న వస్తువులు

తిరుత్తణి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలిలా.. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని కర్లంబాక్కం గ్రామంలో పళని (45)అనే వ్యక్తి ఆ ప్రాంతంలోని సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం బయట డాక్యుమెంట్‌ రైటర్‌గా పనిచేస్తూ తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తన బంధువుల వివాహ వేడుకలకు కుటుంబ సభ్యులంతా తిరుపతి వెళ్లారు. ఈ నేపథ్యంలో కొంతమంది దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోని సుమారు వంద సవర్ల నగలు, 2 కిలోల వెండి వస్తువులు, రూ.2లక్షల నగదు, విలువైన పట్టుచీరలను దోచుకెళ్లారు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చిన పళని ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా, వస్తువులన్నీ చిందరవందరగా పడిఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇంట్లో మద్యం సీసాలను గమనించి చోరీ అనంతరం దుండగులు ఆ ఇంట్లోనే మద్యం సేవించినట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా వుండగా, గత కొన్ని నెలలుగా తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా దొంగతనాలు పెరిగిపోతున్నాయని, పోలీసులు సకాలంలో దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టు కోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

### గాంధీ తర్వాత దేశాన్ని అర్థం చేసుకున్న వ్యక్తి మోదీ

● గవర్నర్‌ ఆర్‌ఎన్‌ రవి కితాబు

అడయార్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ తర్వాత, భారతదేశాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న ఒకే వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని రాష్ట్ర గవర్నర్‌ ఆర్‌ఎన్‌ రవి కొనియాడారు. దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి గిండిలోని రాజ్‌ భవన్‌లో వేడుకలు నిర్వహించి పలు పోటీల విజేతలకు, ప్రత్యేక ప్రతిభ కనపరచిన వ్యక్తులకు గవర్నర్‌ రవి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఒకే భారతం, ఉన్నత భారతం అని తెలియజేసేలా రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. మోదీ ప్రభుత్వంలో, 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, ప్రస్తుతం 6 శాతం మాత్రమే పేదరికం ఉందన్నారు. రాబోయే రోజుల్లో పేదరికం లేని పరిస్థితులు రానున్నాయని గవర్నర్‌ తెలిపారు.

### 17వ ఏట టూ వీలర్‌ నడుపుతూ ప్రమాదం

● ఐదేళ్ల తరువాత శిక్ష వేసిన కోర్టు



ట్రాఫిక్‌ డ్యూటీ చేస్తున్న యువకుడు

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విల్లుపురంలో 17 ఏళ్ల వయస్సులో టూ వీలర్‌ నడుపుతూ ఓ ప్రమాదానికి కారణమైన బాలుడికి జువైనల్‌ కోర్టు, 22వ తేది ట్రాఫిక్‌ పోలీసులతో ట్రాఫిక్‌ నియంత్రణ చేపట్టాలంటూ వినూత్న శిక్ష విధించింది. 2020లో ఆ బాలుడు నడిపిన టూ వీలర్‌ ఢీకొని కుమార్‌ అనే వ్యక్తి గాయపడ్డాడు. ఆ కేసు విచారణ పూర్తయిన నేపథ్యంలో న్యాయమూర్తి, ప్రమాదానికి కారణమైన యువకుడు, వచ్చే జనవరి వరకు మూడు నెలలు శని, ఆదివారాల్లో ట్రాఫిక్‌ పోలీసులతో కలసి ట్రాఫిక్‌ నియంత్రణ చేపట్టాలని ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం, ప్రస్తుతం 22 ఏళ్ల ఆ యువకుడు శని, ఆదివారాల్లో ట్రాఫిక్‌ నియంత్రణ విధులు చేపట్టాడు.

### మదురై ఆధీనం వద్ద రెండోసారి పోలీసుల విచారణ

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదురై ఆధీనంను సైబర్‌ క్రైం పోలీసులు శనివారం రెండవసారి విచారించారు. కాటాన్‌ కొళత్తూర్‌లో జరిగిన శైవ మహానాడులో పాల్గొనేందుకు మదురై ఆధీనం కారులో వెళ్తుండగా ఉళుందూర్‌పేట ప్రాంతంలో మరో కారు తన కారును ఢీకొందంటూ మత ఘర్షణలు రెచ్చగొట్టేలా ప్రసంగించారు. ఈ వ్యవహారంపై చెన్నై పోలీసులు మదురై ఆధీనం జ్ఞానసంబంధర్‌ దేశిక పరమాచార్యపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ కేసులో మదురై ఆధీనంకు ముందస్తు బెయిలు మంజూరు చేసిన కోర్టు, పోలీసులు ఆయన దగ్గరకు వెళ్లి ప్రశ్నించవచ్చని ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం గత జూలై 20వ తేది మదురై ఆధీన మఠానికి చెందిన చెన్నై సైబర్‌ క్రైం పోలీసులు, మదురై ఆధీనాన్ని గంటసేపు ప్రశ్నించారు. ఈ క్రమంలో రెండోసారి చెన్నై సైబర్‌ క్రైం పోలీసులు శనివారం విచారించారు.

### ఒకే రోజు 59మంది డీఎస్పీల బదిలీ

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పరిపాలనా సౌలభ్యం కోసం, ఐచ్ఛిక ప్రాతిపదికన ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 59 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ (ఇన్‌ఛార్జి) జి.వెంకటరామన్‌ ఉత్తర్వులు జారీ చేశారు. తిరువణ్ణామలై జిల్లా సామాజిక న్యాయం మానవహక్కుల విభాగం డీఎస్పీ ఎస్‌. సురేష్‌ షణ్ముగం, ఆరణి ప్రాంతానికి, ఆరణి డీఎస్పీ డి.పాండీశ్వరి శివగంగ జిల్లాకు బదిలీ అయ్యారు. ధర్మపురి జిల్లా పాలకోడు డీఎస్పీ కేఎం మనోహరన్‌ కృష్ణగిరి జిల్లా సామాజిక న్యాయం మానవహక్కుల విభాగానికి బదిలీ అయ్యారు. ఈరోడ్‌ స్పెషల్‌ టాస్క్‌ఫోర్స్‌ డీఎస్పీ ఎం.సుకుమార్‌ ఆ జిల్లాలో ఎక్సైజ్‌ విభాగానికి బదిలీ అయ్యారు. ఇదే రీతిలో తక్కిన డీఎస్పీలు కూడా వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు.

### రేపు విద్యుత్‌ గ్రీవెన్స్‌

అడయార్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌, తండయార్‌పేట, అంబత్తూర్‌, కేకే నగర్‌ పరిధిలో సోమవారం విద్యుత్‌ సమస్యల పరిష్కార శిబిరం జరుగనుంది. ఈ మేరకు తమిళనాడు విద్యుత్‌ బోర్డు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

## డంపింగ్‌ యార్డ్‌ను వేరే ప్రాంతానికి మార్చండి

● కలెక్టర్‌కు ప్రజల విజ్ఞప్తి



మీడియాతో మాట్లాడుతున్న ప్రజలు

తిరుత్తణి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు యూనియన్‌ పరిధిలోని డంపింగ్‌ యార్డ్‌లో గత ఏడాదిగా నిల్వవున్న వ్యర్థాలతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొంటున్నారు. వివరాలిలా.. పళ్లిపట్టు యూనియన్‌లో 15 వార్డులున్నాయి. ఇక్కడ నివసిస్తున్న ప్రజల నుంచి సేకరించిన వ్యర్థాలను సమీపంలోని డంపింగ్‌ యార్డులో నిల్వవుంచి రీసైక్లింగ్‌ ప్రక్రియ జరుపుతుంటారు. ఈ క్రమంలో గత ఏడాదిగా డంపింగ్‌ యార్డులో చెత రీసైక్లింగ్‌ చేయకుండా నిలిచిపోయి వ్యర్థాలు పేరుకుపోవడంతో సమీపంలో నివసిస్తున్న ప్రజలు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం స్థానికులు దీనిపై మీడియాతో మాట్లాడుతూ, పేరుకుపోయిన చెత్తతో దోమల బెడద ఎక్కువవుతోందని, పిల్లలు, గర్భిణులు విషజ్వరాల బారిన పడుతున్నారన్నారు. వ్యర్థాల నుండి వస్తున్న దుర్వాసన కారణంగా సమీపంలో ప్రాథమిక వైద్యశాలను వేరే ప్రాంతానికి మార్చాల్సివచ్చిందని, డంపింగ్‌ యార్డు పక్కనే ఉన్న మునీశ్వరాలయానికి వచ్చే భక్తులు పూజలు చేసేందుకు కూడా తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారని, దీనిపై పలుమార్లు మున్సిపల్‌ అధికారులకు విన్నవించినా ఫలితంలేదని, జిల్లా కలెక్టర్‌ దీనిపై స్పందించి డంపింగ్‌ యార్డును వేరే ప్రాంతానికి మార్చాలని ప్రజలు అభ్యర్థిస్తున్నారు.

### ప్రయాణికులతో చిల్లర గొడవలొద్దు

● కండక్టర్లకు ఎంటీసీ ఆదేశం

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టిక్కెట్టు సరిపడా చిల్లర ఇవ్వాలని ప్రయాణికులతో వాగ్వివాదానికి దిగొద్దని డ్రైవర్‌, కండక్టర్లకు మెట్రోపాలిటన్‌ ట్రాన్స్‌పోర్ట్‌ కార్పొరేషన్‌ (ఎంటీసీ) ఆదేశించింది. ఈ మేరకు ఎంటీసీ జాయింట్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ గుణశేఖరన్‌ జారీచేసిన సర్క్యులర్‌లో వివరాలిలా ఉన్నాయి... టిక్కెట్టుకు సరిపడా చిల్లర ఇవ్వాలని కండక్టర్లు ప్రయాణికులతో వాగ్వాదానికి దిగుతున్నట్లు ఫిర్యాదులందాయన్నారు. అలాంటి చర్యలను కండక్టర్లు, డ్రైవర్లు మానుకోవాలన్నారు. డిపోలో బస్సు బయల్దేరే సమయంలో అడ్వాన్స్‌గా అందజేసే నగదును, ప్రయాణికులకు టిక్కెట్టుతో పాటు అందించాల్సిన చిల్లరకు వినియోగించాలన్నారు. ప్రయాణికులు కూడా తగిన చిల్లర అందజేయాలని సూచించారు. ప్రయాణికులను వేధిస్తున్నట్లు ఫిర్యాదులందితే, సంబంధిత కండక్టర్‌పై చర్యలు చేపడతామని ఎంటీసీ హెచ్చరించింది.

### బుక్‌ రీడింగ్‌పై అవగాహన



నిర్వాహకులకు పుస్తకం అందజేస్తున్న దృశ్యం

వేలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేలూరు టోల్‌గేట్‌ వద్దనున్న ముత్తునగర్‌లో ఆదివారం ఉదయం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో బుక్‌ రీడింగ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డార్లింగ్‌ వెంకటసుబ్బు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుస్తక పఠనం ద్వారా జ్ఞాపకశక్తి పెరిగి మానసికోల్లాసం కలుగుతుందని, ప్రతి ఒక్కరికి బుక్‌ రీడింగ్‌ పట్ల అవగాహన కలిగివుండాలని సూచించారు. అనంతరం సంస్థ నిర్వాహకులకు ఆయన పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుశీల వెంకటసుబ్బు, తమిళ కవి మహేంద్ర, కదిర్‌ తదితరులు పాల్గొన్నారు.

### పీఎంకే వేలూరు జిల్లా కార్యవర్గ సమావేశం



వేదికపై పీఎంకే నిర్వాహకులు

వేలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పాట్టాలి మక్కల్‌ కట్చి (పీఎంకే) కార్యవర్గ సభ్యుల సమావేశం ఆదివారం ఉదయం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు సారథి, కార్యదర్శి వెంకటేశన్‌ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ దురై పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి వరలక్ష్మి, నిర్వాహకులు సుభాష్‌, సెంథిల్‌కుమార్‌, వన్నియార్‌ కుల సంఘాల నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఆరుగురికి పునర్జన్మ ప్రసాదించిన రైతు



ఈశ్వరన్‌ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మెదడు నిర్జీవమైన రైతు, తన అవయవాల ద్వారా ఆరుగురికి పునర్జన్మ ప్రసాదించారు. తేని జిల్లా కీళకూడలూరు ఉత్తమపాళయం ప్రాంతానికి చెందిన రైతు ఈశ్వరన్‌ (55), గత నెల 29వ తేది సాగుపనుల నిమిత్తం కరునాగముత్తన్‌పట్టి ప్రాంతంలో నడచి వెళ్తుండగా బైక్‌ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తలకు తీవ్రగాయమై ఈశ్వరన్‌ మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు నిర్ధారించారు. ఈశ్వరన్‌ అవయవాలు దానం ఇచ్చేందుకు కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా వెలికితీసిన గుండె, ఊపిరితిత్తులను శనివారం ప్రత్యేక విమానంలో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అలాగే, లివర్‌ తిరుచ్చిలోని ప్రైవేటు ఆస్పత్రి, ఒక కిడ్నీ, కళ్లు మదురై ప్రభుత్వాసుపత్రి, మరో కిడ్నీ తిరుచ్చిలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అవయవాలు దానం చేసిన ఈశ్వరన్‌ భౌతిక దేహానికి ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది నివాళులర్పించారు.

### ఘనంగా పాఠశాల రజతోత్సవాలు



వేదికపై పాఠశాల నిర్వాహకులు

వేలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేలూరు సన్‌బీమ్‌ పాఠశాల రజతోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్‌ తంగప్రకాష్‌, అధ్యక్షుడు హరిగోపాలన్‌ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్‌ వెంకటేశన్‌ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో క్రీడా మైదానానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్‌ ప్రెసిడెంట్‌ జార్జ్‌ అరవింద్‌, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

### పేర్నాంబట్టు పర్వతంపై ఏనుగు అస్తిపంజరం లభ్యం



ఏనుగు అస్తిపంజరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు, వెటర్నరీ వైద్యులు

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పేర్నాంబట్టు ఫారెస్ట్‌ రేంజ్‌లో అరవట్ల కొండ ప్రాంతం వద్ద ఓ అడవి ఏనుగు అస్థిపంజరాన్ని అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఫారెస్ట్‌ వాచర్లు శనివారం సాయంత్రం ఆ ప్రాంతంలో గస్తీ తిరుగుతుండగా ఓ చోట ఏనుగు అస్థిపంజరాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు, వెటర్నరీ డాక్టర్లతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్ళి విచారణ జరిపారు. అది వయస్సు ఏడు నుండి ఎనిమిదేళ్లలోపుండే ఆడ ఏనుగు అని వెటర్నరీ డాక్టర్లు నిర్ధారించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఆ ఏనుగు మృతి చెంది నెలరోజులై ఉంటుందని అనుమానిస్తున్నారు. ఆ ఏనుగు అస్థిపంజరంలోని కొన్ని భాగాలను సేకరించి ప్రయోగశాలకు పంపినట్లు అధికారులు తెలిపారు. ఫలితాలు వచ్చాకనే ఏ కారణంగా ఆ ఏనుగు మృతి చెందిందో తెలుసుకోగలుగుతామన్నారు. ఆ అడవి ఏనుగు నీటి కోసం వచ్చి కాలుజారి పడి మృతిచెంది ఉంటుందని భావిస్తున్నట్లు అటవీ శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

### జిరాక్స్‌ సెంటర్‌ యజమాని నిజాయితీ

● ఐదు సవర్ల నగల అప్పగింత



అడయార్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిరాక్స్‌ సెంటర్‌లో ఓ వినియోగదారుడి మరచిపోయిన బంగారు నగలను వాటి యజమానికి అప్పగించిన సెంటర్‌ యజమానిని పలువురు ప్రశంసించారు. స్థానిక ఐస్‌హౌస్‌ వీఆర్‌ పిళ్లై రోడ్డులో వేల్‌మురుగన్‌ జిరాక్స్‌ సెంటర్‌ నడుపుతున్నాడు. ఆ సెంటర్‌కు గత నెల 24వ తేది వచ్చిన ఓ వినియోగదారుడు ఐదు సవర్ల నగలను పోగొట్టుకున్నాడు. వేల్‌మురుగన్‌ బంగారు నగ గమనించి డి-3 ఐస్‌ హౌస్‌ పోలీస్‌ స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు, నగరంలోని అన్ని పోలీస్‌ స్టేషన్లకు సమాచారం ఇచ్చా రు. కలైవానన్‌ తన భార్యను ప్రసవం కోసం ట్రిప్లికేన్‌లోని ఆసుపత్రిలో చేర్చగా, ఆమె తన మెడలోని మంగళసూత్రాన్ని అందజేసింది. కలైవానన్‌ జెరాక్స్‌ సెంటర్‌కు వెళ్లిన సమయంలో మరిచిపోయాడు. ఐస్‌ హౌస్‌ పోలీసులు శనివారం కలైవానన్‌ భార్య రంజితను పోలీస్‌ స్టేషన్‌కు పిలిపించి జెరాక్స్‌ సెంటర్‌ యజమాని వేల్‌మురుగన్‌ భార్యతో మంగళసూత్రం అప్పగించారు.

### డీఎంకే సర్కార్‌కు కౌండౌన్‌ ప్రారంభం

● రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నయినార్‌ నాగేంద్రన్‌

ప్యారీస్‌, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎంకే సర్కార్‌కు కౌంట్‌ డౌన్‌ ప్రారంభమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్‌ నాగేంద్రన్‌ విమర్శించారు. తిరుచ్చిలో ఆదివారం జరిగిన బీజేపీ జిల్లా నేతల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిన ధాన్యం బస్తాలు వర్షాలకు తడిసి మొలకలెత్తాయని, ఈ వ్యవహారంలో రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అయినా అన్నదాతలను సీఎం స్టాలిన్‌ పట్టించుకోవట్లేదన్నారు. డీఎంకే అధికారం ముగిసేందుకు ఇక 140 రోజులే ఉన్నాయని, దీనికి సంబంధించిన కౌండౌన్‌ ప్రారంభమైదన్నారు.